ప్రభుత్వ ఆదాయానికి గండి!

- అనుమతులు రాకుండానే తవ్వేస్తున్న వైనం
- పెడనలో జింజేరు, పెందుర్రులో చెరువుల అక్రమ తవ్వకాలు
- అడిగే వారేరి.. అడ్డుకునే వారెక్కడ..?



పెడన మండలం జింజేరులో అనధికారికంగా తవ్వుతున్న చెరువు

పెడన: ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ కొందరు అక్రమంగా చెరువులు తవ్వేస్తున్నారు. పంట పొలాలైనా, బీడు భూములు అయినా చెరువులు తవ్వాలంటే అనుమతులు తప్పనిసరి. అటువంటి అనుమతులు కోసం ప్రభుత్వానికి కొంత ఫీజు చెల్లించాలి. అటువంటి ఫీజులు కట్టకుండా అనుమతుల కోసం దరఖాస్తు చేసి ప్రభుత్వాదాయానికి అడ్డగోలుగా గండికొడుతూ అనధికారికంగా చెరువులు తవ్వేస్తున్నారు. కేవలం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులు వచ్చిన తర్వాత తవ్వుకోవాలి. కానీ అధికారులు ఎటువంటి అనుమతులు జారీ చేయకపోయినా ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి అడ్డగోలుగా చెరువులను తవ్వేస్తుండటంపై నియోజకవర్గంలో తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా వస్తున్న ఫిర్యాదులను సైతం పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తుండం గమనార్హం. ఇలా ఫిర్యాదులు చేసిన వారిని బెదిరించడంతో వారు మిన్నకుండి పోతుండటం పరిపాటిగా మారింది. కూటమి సర్కారులోని నాయకులు ఇలా ప్రవర్తిస్తుండటంతో నోరు విప్పితే తమ పరిస్థితి ఏమిటోనసే భయందోళన చెందుతున్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే సీజ్ చేయడం లేదు

రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే వాటిని సీజ్ చేయడం లేదనే విషయం తేటతెల్లమవుతోంది. నియోజకవర్గ స్థాయిలో ఒత్తిళ్లు రావడంతో క్షేత్రస్థాయి సిబ్బంది కూడా మారు మాట్లాడలేని దుస్థితి. మండల స్థాయి అధికారులు పనులను ఆపేందుకు వెళ్తే ఫోన్ల మీద ఫోన్లు వస్తుండటంతో అధికారులు కూడా విసుగు చెందుతున్నారు. ఉన్నతాధికారులు కూడా ఇటుగా కన్నెత్తి చూడకపోవడం, ఆకస్మిక తనిఖీలు చేయకపోవడం విశేషం. బంటుమిల్లి మండలంలో చెరువుల తవ్వకాలపై సంబంధిత మత్స్యశాఖాధికారి ఎఫ్‌డీవోను సంప్రదిస్తే వారు అందుబాటులో లేకపోవడం, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడం విశేషం. ఒక పక్క చెరువును తవ్వుతూ వచ్చిన మట్టిని కొంత గట్టులుగా వేయడం మరికొంత మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించడం చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

ఎటువంటి అనుమతులు లేవు

జింజేరు ఆక్వా జోన్‌లో ఉంది. తాజాగా మత్స్యశాఖకు ఎవరూ కూడా చెరువులు తవ్వకానికి సంబంధించి దరఖాస్తు చేయలేదు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసినా ఆ సమాచారం క్షేత్రస్థాయిలోని మాకు కూడా ఉత్తర్వు కాపీలు అందుతాయి. మాకు ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. మా స్థాయిలో ఎవరికి కూడా అనుమతులు ఇవ్వలేదు.

–సాయి,
మత్స్యశాఖ అధికారి, పెడన మండలం

ఎక్కడెక్కడ అంటే..

పెడన మండలం జింజేరు గ్రామపంచాయతీ పరిధిలో చెరువులు నాలుగైదు ఎకరాలు కాదు ఏకంగా సుమారు 30 ఎకరాల్లో, బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామంలో పది ఎకరాల్లో చెరువులను రాత్రిపగలు తేడా లేకుండా తవ్వేస్తున్నారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ సిబ్బందినే కాకుండా మండల, డివిజన్ స్థాయిలోని అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు చేయిస్తూ అనధికారికంగా చెరువులను తవ్వేస్తున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో మండల స్థాయి అధికారులు అనధికారికంగా తవ్వుతున్న చెరువుల వద్దకు వెళ్లి పనులు నిలుపుదల చేస్తున్నారు. కాని వాహనాలను అక్కడే వదిలేసి వస్తుండటంతో మళ్లీ మరుసటి రోజు నుంచి పనులు ముమ్మరంగా కొనసాగుతుండటం గమనార్హం. రెవెన్యూ అధికారులు,



పెందుర్రులో చెరువును తవ్వుతూ టిప్పర్లలో మట్టిని పోస్తున్న జేసీబీ

సిబ్బంది సైతం వెళ్లి పనులను నిలుపు చేశామని ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలను సైతం పంపిస్తున్నారు. వాస్తవంగా అనధికారికంగా చెరువులను తవ్వుతున్న జేసీబీలను సీజ్ చేయాలి. కాని చేయకపోవడం కొసమెరుపు.

ఆక్వాజోన్‌లో ఉంది.. రెవెన్యూ అనుమతులున్నాయి

రెవెన్యూ పరంగా అనుమతుల కోసం దరఖాస్తు చేయడమే కాకుండా వాటికి సంబంధించి ఫీజులు కూడా కట్టారు. పనులు జరుగుతున్నాయని సమాచారం రావడంతో వాటిని నిలుపుదల చేశాం. పూర్తిస్థాయి అనుమతులు వచ్చిన తర్వాతే తవ్వుకోవాలని కూడా స్పష్టం చేశాం. ఈ దఫా మళ్లీ పనులు చేస్తే మాత్రం వాహనాలను సీజ్ చేస్తాం.

–కె.అనిల్‌కుమార్,
ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

క్లుప్తంగా

23న నందీశ్వరుడికి పంచామృతాభిషేకాలు

నాగాయలంక: శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో నందీశ్వరుడికి ఈ నెల 23వ తేదీ భక్తులతో స్వీయ పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ గురువారం తెలిపారు. బహుళ త్రయోదశి పురస్కరించుకుని ప్రదోషకాలంలో పంచామృతాలతో భక్తులు స్వయంగా అభిషేకించుకోవచ్చని చెప్పారు. అభిషేక వస్తువులను భక్తులే తెచ్చుకోవాలని సూచించారు. త్రయోదశి ప్రదోషకాలంలో నందికి అభిషేకంతో మాతృ, పితృ, బాలారిష్ట దోషాలు తొలగిపోతాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94906 36466, 77993 65544 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నివాళి



చల్లపల్లి: యార్లగడ్డ గ్రామానికి చెందిన ఉమ్మిడిశెట్టి శంకర్(47) భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం నివాళులు అర్పించారు. ఆ పార్టీకి చెందిన శంకర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న రమేష్‌బాబు వారి స్వగృహానికి వెళ్లి శంకర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రేపు చల్లపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చల్లపల్లి: ఈనెల 21వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.వి.రమణ గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కోట విజయరాధిక అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నల్లని పొగ.. ఇలా అయితే ఎలా!



చల్లపల్లి: వాహన యజమానుల నిర్లక్ష్యానికి వాతావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. వాహనాలకు సమయానుకూలంగా మరమ్మతుల చేయించకపోవడం, నిర్వహణ లోపం కారణంగా వాహనాలు దట్టమైన నల్లని పొగ వదులుతూ గాలి కాలుష్యానికి కారకాలు అవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నాయి. చల్లపల్లి ప్రధాన రహదారుల్లో నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో కొన్ని వాహనాల నుంచి నల్లని పొగ వస్తోంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి కాలం చెల్లిన వాహనాలను రోడ్డుపై తిరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పశు పోషకులకు నాణ్యమైన వైద్య సేవలు



శ్రీకాకుళం(ఘంటసాల): పశు పోషకులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తానని బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ దేవిన హరీష్ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని పశు వైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ దేవిన హరీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ మాట్లాడుతూ విజయవాడలో విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా ఘంటసాల మండలం శ్రీకాకుళం పశువైద్యశాలకు వచ్చానని, ఇక్కడ ఇన్‌చార్జిగా ఉంటూ మండల పశు వైద్యాధికారిగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

ఆటపాటలతో చదువు నేర్పించాలి



పిల్లలతో మమేకమైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు

చల్లపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలబాలికలకు ఆటపాటలతో కూడిన సంతోషకరమైన వాతావరణంలో చదువు నేర్పించాలని మొవ్వ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. చల్లపల్లిలో ఒకటి, 13వ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ ప్రాంగణంలోని పరిసరాలు, రికార్డులను, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలతో మమేకమై వారిని ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టి అభినందించారు. తల్లులు తమ పిల్లల్ని సమయానికి అంగన్‌వాడీ కేంద్రాలను పంపిస్తున్నారా.. లేదా.., ప్రతి నెలా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారా.. లేదా అనే అంశాలను టీచర్లను అడిగి తెలుసున్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చల్లపల్లి, లక్ష్మీపురం సెక్టార్ సూపర్‌వైజర్లు సీహెచ్ ఆదిలక్ష్మి, విశ్రాంతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీతో సంబంధం లేకుండా 'సుఖీభవ' అందజేయాలి



రైతు సంఘ సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి నాగేశ్వరరావు

బంటుమిల్లి: మండల పరిధిలోని రైతులకు, కౌలు రైతులకు ఈకేవైసీతో సంబంధం లేకుండా ప్రభుత్వం అందజేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘ సమావేశంలో పెడన డివిజన్ కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ సర్వర్ల సమస్యతో చాలా మంది రైతులకు ఈకేవైసీ ఆన్‌లైన్ పూర్తి కాలేదన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం ప్రకటించిన జాబితాల్లో రైతుల పేర్లు కనిపించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతోపాటు కౌలు రైతులకు ఈ పథకం వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాలువలకు నీటి విడుదల జరిగిన క్రమంలో వ్యవసాయ పనులు ప్రారంభమైన అధికారులు డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టలేదని ఆయన ఆరోపించారు. వ్యాపారస్తులు ప్రభుత్వ మద్దతు ధరకు మినుములు కొనుగోలు చేయని కారణంగా ఇంకా రైతుల వద్ద దాదాపు 60 శాతం నిల్వలు ఉన్నాయని నాగేశ్వరరావు తెలిపారు. మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం డిమాండ్ చేసినా అధికారులు పట్టించుకోలేదని నాగేశ్వరరావు విమర్శించారు. ప్రభుత్వం స్పందించి రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సమావేశంలో బంటుమిల్లి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సుజ్ఞానం జనార్దన్‌రావు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శివరామప్రసాదు, ఎల్. అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్ల ధ్వంసం



మల్లపరాజుగూడెం-రావిగుంట గ్రామాల మధ్య దమ్ము చక్రాలతో తిరుగుతున్న ట్రాక్టర్

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ట్రాక్టరు యజమానులు నిబంధనలు గాలికి వదిలివేసి తారు రోడ్లపై దమ్ము చక్రాలు తిప్పుతూ రహదారులు ధ్వంసం కావడానికి కారణమవుతున్నారు. గ్రామ, మండల స్థాయి అధికారులు స్థానికంగా ఉండని కారణంగా పర్యవేక్షణ లేక కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు దమ్ము చక్రాల కారణంగా గాళ్లు పడుతున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు నారుమళ్లు పోసుకునేందుకు దమ్ము చక్రాలను బిగించి పొలాలకు తారు రోడ్లపై రాకపోకలు చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తారు రోడ్లపై దమ్ము చక్రాలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యోగాతో మానసిక ఒత్తిడిని జయించవచ్చు



పులిగడ్డ గురుకుల పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

అవనిగడ్డ: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో మండలంలోని పలు స్కూల్స్‌లో విద్యార్థులకు యోగాభ్యాసాలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, పులిగడ్డ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్యభారతి కృష్ణా జిల్లా అధ్యక్షుడు గుడిసేవ విష్ణుప్రసాద్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆధ్యాత్మిక సాధనకు యోగ మంచి దివ్య ఔషధం అన్నారు. యోగాతో విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించ వచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రథమ చికిత్స ప్రముఖ్ డాక్టర్ వంగర శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయుడు కొండవీటి రవీంద్రబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు మునగాల ఉదయ్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తం



చందాల అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియాపై అవగాహన కలిగిస్తున్న వైద్యులు

కృత్తివెన్ను: డయేరియా (అతిసార) వ్యాధిపై ప్రజలంతా అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యురాలు మిథున అన్నారు. గురువారం స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా మండలంలోని గరిశపూడి, మాట్లాం సచివాలయాల పరిధిల్లోని అంగన్‌వాడీలు, పాఠశాలల్లోని పిల్లలకు డయేరియాపై అవగాహన కల్పించారు. వ్యాధి నియంత్రణకు పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలంతా కాచిచల్లార్చిన సురక్షితమైన నీటిని తాగాలన్నారు. ఎక్కువగా నిల్వ ఉన్న చేపలు, మాంసం లాంటి మాంసాహార పదార్థాలు తినకూడదన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఓఆర్ఎస్, జింక్ కాంబో ప్యాక్‌లను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాధర్, సీహెచ్‌వో మీరమ్మ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ఫస్ట్ సాధించిన ఇంటర్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో జిల్లా ఫస్ట్ సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కారంకి గంగా భవాని బైపీసీలో 440కి 420 మార్కులు, సీఈసీలో కాకర్ల వికాస్ 500కి 480 మార్కులు సాధించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వీరిద్దరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీ నరసింహారావు, ఎంపీటీసీ బొప్పన భాను, అధ్యాపకులు దుడ్డు కృష్ణారావు, సింగం దిలీప్‌కుమార్, అన్నెపాక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ



పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ గురువారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 182 మందికి 179 మంది హాజరయ్యారని, ముగ్గురు అబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి 171 మంది హాజరయ్యారని, తొమ్మిది మంది అబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్లలో 362 మందికి 350 మంది హాజరవ్వగా 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు.

మచిలీపట్నంఅర్బన్: కృష్ణాజిల్లాలో ఏర్పాటు చేసిన 5 పరీక్ష కేంద్రాల్లో గురువారం మెగా డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్లో పరీక్షకు 1,473 అభ్యర్థులకు 1,405 మంది హాజరుకాగా 68 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్లో 1,437 అభ్యర్థులకు 1,393 మంది హాజరయ్యారు, మరో 44 మంది గైర్హాజరయ్యారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కృత్తివెన్ను: కృత్తివెన్ను స్లోపు సమీపంలో జరుగుతున్న అయ్యప్పస్వామి వార్షిక మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పల్లకిలో స్వామివారిని ఉంచి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

పెనమలూరు: గుండెకు అత్యవసర పరిస్థితిలో ఉపయోగపడే కార్డియోపల్మనరి రిససిటేషన్(సీపీఆర్)పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఎమర్జెన్సీ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ టి.కృష్ణ చైతన్యకుమార్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఫ్యాకల్టీకి సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత రక్షణలో సీపీఆర్ చాలా ముఖ్యమన్నారు. గుండెనొప్పి వచ్చిన సమయంలో అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ చేస్తే పేషెంట్ కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. గుండె నొప్పి వచ్చే సమయంలో లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు లావణ్య, ఆనంద్, వైద్య బృందం పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుల వేళ అప్రమత్తంగా ఉండాలి



శ్రీకాకుళం(ఘంటసాల): ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లో ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయప్రసాద్ మాట్లాడుతూ వరదల సమయాల్లో అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లాలని, అధికారుల ఇచ్చిన సలహాలు తప్పకుండా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాస్, వీఆర్వో డి.గోపి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, పోలీసులు, గ్రామస్తులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రోజూ యోగాకు సమయం కేటాయించాలి

పెడన: ప్రతి రోజూ యోగాకు కొంత సమయం కేటాయించాలని పలుచోట్ల అధికారులు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి మున్సిపల్ ఉద్యోగి సిద్ధంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎల్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కమిషనర్ తన చాంబరులో మున్సిపల్ మేనేజర్ రాజా ఉద్యోగులతో పాటు సచివాలయాల ఉద్యోగులతో యోగాంధ్రపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడానికి నాలుగు ప్రాంతాలను పరిశీలించామని, ఫైనల్ ప్లేస్‌ను శుక్రవారం ఫిక్స్ చేసి అక్కడ ఏర్పాట్లు చేస్తామన్నారు. పట్టణంలో తొమ్మిది సచివాలయాలకు ముగ్గురు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించామన్నారు. ఒకటి నుంచి మూడు వరకు టీపీవో సుజనకుమారి, 4 నుంచి 6 వరకు ఆర్ఐ వెంకటేశ్వరరావు, 7 నుంచి 9వ సచివాలయాలను సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య పర్యవేక్షిస్తారని, ఆయా సచివాలయాల సిబ్బంది పూర్తి స్థాయిలో మీ పరిధిలోని యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు హాజరయ్యేలా చూడటమే కాకుండా నివేదికలు ఇవ్వాలని స్పష్టం చేశారు.

యోగాతో మానసిక సమతుల్యత

గూడూరు: యోగాతో మానసిక సమతుల్యత సమకూరుతుందని బందరు డీవైఈఓ బి.ఎస్.సి.శేఖర్‌సింగ్ విద్యార్థులకు సూచించారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీవైఈఓ విద్యార్థులతో పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని గొరిపర్తి విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా రామకృష్ణకు పూర్తి అదనపు బాధ్యతలు

గూడూరు: గూడూరు ఎంపీడీఓగా కె.వి.రామకృష్ణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు ఎంపీడీఓ అనూహ్య ప్రభుత్వ శిక్షణ తరగతులకు వెళ్లడంతో ఇప్పటి వరకు ఏఓగా పనిచేసిన మోటేపల్లి వనజ ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆమె అవనిగడ్డకు బదిలీ కాగా ఆమె స్థానంలో కె.వి.రామకృష్ణ నియమితులయ్యారు.

కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయం

కోనేరుసెంటర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వైఎస్సార్ సీపీ నార్త్ మండల రైతు విభాగం నాయకుడు గడిదేశి రాజు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం కోసం అన్ని వర్గాలను మోసం చేస్తున్నట్లే అన్నం పెట్టే అన్నదాతలను దగా చేస్తున్నారన్నారు. సౌత్ మండల అధ్యక్షుడు జన్ను రాఘవరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు అండగా నిలిచారన్నారు. నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహననాంచారయ్య మాట్లాడుతూ ఆక్వా రైతాంగాన్ని మోసం చేసిన ఘనుడు చంద్రబాబునాయుడన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి జయరాజు, నార్త్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడిదేశి బాలజీసు, జిల్లా జాయింట్ సెక్రటరీ జువ్వా నాగరాజు, మండల నార్త్ అధ్యక్షుడు మందా బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పాఠశాల రిజిస్టర్ల నిర్వహణ



గూడూరు: పాఠశాల రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని గూడూరు మండల విద్యాశాఖాధికారి-2 పి.సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. రామరాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ-2 ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన హాజరు తదితర రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యపై ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపిస్తోందన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేస్తోందన్నారు. విద్యార్థులంతా పాఠశాలలోనే భోజనం చేస్తుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.విశ్వనాథ్, ఉపాధ్యాయుడు మహంకాళరావు తదితరులు పాల్గొన్నారు.